# అడవి తల్లి

— ఐతా చంద్రయ్య

అర్ధరాత్రి కావస్తోంది. అడవిలోని గుడిసెలో గుడ్డిదీపం కిటికీ లోంచి వచ్చే గాలితెరలకు తలాడిస్తూ... 'నాగ్గూడా ధైర్య ముంది.' అని నిరూపించుకుంటున్నది.

అడవి గాచిన వెన్నెల అదే కిటికీలోంచి వేంచేసి కమలవీపు మీదాడుతోంది. అయినా కమలను నిద్రాదేవి కరుణించట్లేదు. దృష్టిని నాలుగువైపులా సారించి గుడిసెగోడల నోసారి పరిశీలనగా చూసుకుంది.

పక్కన విదురుడు నిద్రబోతున్నాడు. పది నెలలు మోసి పది సంవత్సరాలు పెంచిన కొడుకును చూస్తుంటే గర్వంగా ఉంది. మనసు నిండిపోతుంది. 'నేను ముళ్ళ బాటలో నడిచినాసరే. వీణ్ణి పూలబాట మీద నడిపిస్తా' అనుకుని తృప్తి పడింది ఎప్పట్లాగే.



దట్టమైన అడవిలో చిట్టచివరి పూరిగుడిసెలో పడుకోవడమేమీ ఆమెకు కొత్తకాదు. 'చెట్టూ పుట్టా తిరగడం, కొండా కోనల్ని దాటడం, వాగూ వంకల్ని పలుకరించడం తనలాంటి గిరిజన స్త్రీలకు అలవాటే. దిక్కు లేని వాళ్లకు దేవుడే దిక్కు అంటారు, తనకెవ్వరూ లేరు. కాని కొడుకున్నాడు. మరికొన్నేళ్ళు కష్టపడి చదివిస్తే వాడు పెరిగి పెద్దోడవుతాడు. తనను కుర్చీలో కూచోబెట్టి రాణిలా చూసుకుంటాడు. కానీ... ఇప్పుడేం చెయ్యాలె? తెల్లారితే తన బతుక్కో పరీక్ష, సగమీదు తిరిగినంక సముద్ర కట్నాలన్నట్టు. నలుగురేమనుకుంటారో! ఆ రోజు కొంగుపట్టుక తిరిగినోని కొంపకు ఈరోజు పోతే నడుమంత్రపు లోకం నవ్వదా? మాయలాడి మంత్రంజేసి వచ్చిందని నన్ను అనరా?...' అలా ఆలోచిస్తూనే ఆమె గతంలోకి వెళ్ళింది.

★★★

కొత్త గుత్తేదారు వచ్చిండట. కష్టపడి పంజెయ్యకపోతే కాళ్లూ చేతులిరగ్గొట్టాడట! అడవిలో వార్త అలా అలా వ్యాపించింది.

కూలికి పంజేసేటప్పుడు రెక్కలు దాచుకుంటే బొక్కలిరగ్గొట్టరా, మరి! అనుకుంది కమల, రోజుమాదిరి ఆ రోజుకూడా పనిలోకెళ్లింది.

బతుకంతా పరులకోసం ధారబోసి ముసలితనంలో పచ్చదనం కరువై, ఎండిమోడైన చెట్లను నరికి పోగులు పెట్టడం మగ కూలీల వంతు. కట్టెలు, పుల్లలు వేరుజేసి కుప్పలుగా పొయ్యడం, లారీల కందివ్వడం ఆడకూలీల వంతు. అటవీశాఖ ఉద్యోగుల కోర్కెలు తీర్చుతూ కూలీల చెమటను లారీల కెక్కించుకుని లక్షలార్జించడం ఫారెస్ట్ కంట్రాక్టర్ల వంతు.

మగ కూలీలు చెట్టుపడగొట్టి కట్టెలు, పుల్లలుగా నరికి వెళ్లిపోయారు. కట్టెలు ఏరి కుప్పబోస్తుంది కమల. నుదుటి నావరించిన చెమట బిందువుల్ని వోణీతో అద్దుకుంది. ఆమె వయసు సొగసులు దొర (కంట్రాక్టర్) జగ్గారావు నూరిస్తున్నై. నాలిక పెదాలను తడిపేస్తున్నది.

"ఓహ్! బంగెనపల్లి మామిడి పండోలుందే!" దగరికొచ్చాడు. కమల ఒళ్లు ఝల్లుమంది.

"నీపేరేంది?" నవ్వుతూ అడిగాడు.

"న్నా.. నా.. పేరా!" బెదిరిపోయి వోణీ సర్దుకుంది. తాబేలులా ముడుచుకుపోతోంది.

"నాపేరు జగ్గారావు, గుత్తేదార్ని, నీలెక్క నేను గూడా మనిషినే. పేరు జెప్పు!' చిరునవ్వుల ప్రయత్నం.

గుండె గుబగుబ ఇంకా తగ్గలేదు. "గుత్తేదారు దొరనా! దండం దొరా!" అని చేతులు జోడించి "నాపేరు కమల" అంది.

"అరె... గీ అడవిల గింత హాయిగుంటే మంచునీళ్లతోని స్నానం జేసినట్టు గట్లా వణికిపోతున్నవెందుకు?"

"కాద్దొరా! నేను... ముచ్చట్లు పెత్తలేను. పంజేస్తున్న."

"కరెక్ట్! నేం జూస్తున్న కమలా! ఇంత మాత్రానికే అంత భయమెందుకూ?" చిరునవ్వుతో చెయ్యందుకున్నాడు.

కమల గుండెల్లో కల్లోలం. అటూ ఇటూ చూసింది. తమాషా చూస్తున్న పెద్దపెద్ద చెట్లు, ఆ చెట్లమీద చిన్న చిన్న పిట్టలు తప్ప మనుషులు లేరు. అంతా భోజనాల కెళ్లినట్టుంది. విడిపించుకోబోయింది. కుదరలేదు.

"అరెరే! వేటగాణ్ణి జూసిన లేడిపిల్లలా గట్లా బెదిరిపోతవెందుకూ నేనేమన్నా అడవి జంతువునా?" మరో చెయ్యందుకున్నాడు లాలనగా.

"పక్కా... కాదు గానీ... నేనాడిదాన్ని గదా! భయ్యాం..." అంది.

"ఆడిదానివే. నేను మొగోణ్ని" అని చేతులు వదిలేశాడు.

"ఆడిదానికో మొగుడు కావాలె. మొగోనికో పెళ్లాం కావాలె." అంది.

అతను వింటున్నాడు. మాటల్లో సమరస భావం. చూపుల్లో చిద్విలాసం. అంతరంగంలో ఆకలి...

"నీకు పెండ్లి గాలేదా దొరా?" కనురెప్పలు పైకెత్తి పరిశీలనగా చూసింది. అతడు నవ్వేశాడు. కమల ఎదలొంచి భయం మాయమైంది. సిగ్గుముంచుకొచ్చింది.

"పెండ్లైతే పరాయి పిల్లను గిట్ల, గిక్కడ పలుకరిస్తనా? నువ్వు జాంఫండోలున్నవ్. పట్నంల నీలాంటి అప్సరస కనబడలేదు." బుజ్జగిస్తూ భుజాలమీద చేతులేశాడు.

"నీగ్గూడా పెండ్లి కాలేదు గదా" కళ్లలో కళ్లు కలిపి సూటిగా చూశాడు.

ఎదపొదలో మలయమారుతం వీచింది. బుగ్గలు సిగ్గుల భారంతో బరువెక్కెనై. విడిపించుకోవాలన్పించలేదు.

"కాలేద్దొరా... నేనూ.. గంత బాగున్నానా!"

"అబ్బో! మాటలతో చెప్పలేను." చెంపమీద చిటికేశాడు. "అచ్చం గంధర్వకన్యలా

గున్నవ్. కమలా! నేను నేన్నే పెండ్లిజేసుకుంట" చేతుల్ని చెంపల్ని తడుముతునే అన్నాడు.

కమల గుండెల్లో తేనెజల్లు కురిసింది.

"నిజంగానా... అబ్బో... నిజ్జంగనా..! కళ్లు విశాలమై పోయినై, ఒళ్లు పులకరించింది. కన్నెమనసు మంచులా కరిగి మానస సరోవరమైంది. అందులో జగ్గారావనే రాజహంస తేలి ఆడుతూంది.

"హమ్మో! గింతపెద్ద గుత్తే దారుడు పెండ్లాన్నైతే... మూడంత్రాల మేడలుంచి పువ్వోలె చూసుకుంటాడు...చిన్నప్పుడు నాయనమ్మ చెప్పిన కథలోని రాకుమారుడు, పువ్వులమ్మే పిల్ల, పంచభూతాల సాక్షిగా పెళ్లి, తర్వాత ఆ పిల్ల మహరాణిగా..." గుర్తుకొచ్చినై.

'ఒట్టు పెట్టుకో దొరా!" దూరం జరిగి చెయ్యిచాచింది.

అరచేతిని గిల్లి "ఒట్టు కమలా! ఈ చెట్లు, ఈ నేల, ఆ ఆకాశం సాక్షిగా నువ్వు నా భార్యవై పోయినవు."అని చేతిలో చెయ్యేసి దగ్గరకు జరిగాడు. "మనకు పాణిగ్రహణమైపోయింది." అమాంతం కౌగిట్లో బంధించి గుండెలకు హత్తుకున్నాడు. నరాలు జివ్వుమన్నై. చెట్ల కొమ్మల సందుల్లోంచి చొచ్చుకొచ్చిన సూర్యకిరణాలు మల్లెపూవుల్లా పరుచుకున్న గడ్డినేల పూల పాన్పయింది.

మాటల్ని నమ్మి లొంగిపోయింది. కోర్కెల గుర్రం కళ్లెం తెంచుకుంది. అంతే... జగ్గారావు ఆకలితీరింది.

"నాకెవ్వరూ లేరు. ఇతడే నా దేవుడు." అనుకుంది.

ఆ తర్వాత రోజూ గుడిసెకొచ్చేవాడు. కావల్సినవన్నీ సమకూర్చేవాడు. ఆరు నెలలు ఆరు నిమిషాల్లా గడిచినై. తాను తల్లి కాబోతున్నానని జగ్గారావుతో చెబుతూంటే ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చింది. అరచేతుల్లో మొహం దాచుకుని "నన్ను మనింటికి తోలుకుపోతానంటివి గదా! ఎప్పుడు పోదాం?" అడిగింది.

"ఆ... మ్మ... మనిల్లా!" జగ్గారావు గొంతులో పచ్చివెలక్కాయ పడింది. లోపలి ఆందోళనను పైకేమాత్రం కనబడనీయలేదు.

"అవును... మనిల్లే... నీ ఇల్లు నా ఇల్లు గాదా? ఎప్పుడు పోదాం చెప్పు." కౌగిట్లో బంధించి కమ్మని చూపులు విసిరింది. జగ్గారావు ఒళ్లంతా చెమట పట్టేసింది.

"నేను.. మా ఊరికి పోయి మా అమ్మా నాన్నలకు చెప్పి మూడ్రోజుల్లో వస్తా. వచ్చి నిన్ను కారులో కూచొబెట్టి తీసుకెళ్తా... సరేనా!" ఊరించాడు. చెక్కిలిగింతలు పెట్టాడు.

మూడ్రోజుల్లో వస్తానన్న జగ్గారావు మూడు నెలలైనా రాలేదు. అతని స్థానంలో వాళ్ల గుమాస్తా అడవికొస్తున్నాడు.

వాంతులు, శారీరక మార్పులు... చిత్రమైన అనుభవాలు ... విచిత్రమైన అనుభూతి... కమలకేదోలాగుంది.

...మొదటి కాన్పుకు అమ్మ దగ్గరుండాలె. కట్టుకున్నోని ఛాతీమీద వాలిపోవాలె. కాని నాకెవలున్నరు? గిసొంటి బతుకు ఏ ఆడిదానిగ్గూడా వద్దమ్మా...భూమాతను ప్రార్థించింది. అడవి తల్లి ఒడిలో సేదగూర్చుకుంది. పనికి వెళ్లకుంటే పస్తులుండాలె. ఇహలాభం లేదని కులపెద్దలకు చెప్పేసింది. కూలీ డబ్బుల్లో మిగిలింది దాచుకున్న దాంట్లోంచి కొంత కల్లుసీసాలకు ఖర్చైంది.

ఇద్దరు కులస్తులు వెళ్లి జగ్గారావునూ, అతని తండ్రినీ వెంటబెట్టుకొచ్చారు. పది మంది ముందు పంచాయతీ జరిగింది.

"నా దగ్గర వందలమంది కూలోలున్నరు.అందులో ఈమె ఒకతి. అంతేగానీ నాకూ, ఈమెకు ఏ సంబంధం లేదు" జగ్గా



రావు చేతులు కట్టుకుని సవినయంగా బుకాయించాడు.

కమల నరాల్లో ప్రకంపనాలు బయలుదేరినై.

అతని తండ్రి మరో అడుగు ముందుకేసి "గాలికి పుట్టి గాలికి పెరిగిన ఈ పిల్ల గాలిమేడలు కట్టుకుంటుంది. నా కొడుకుమీద నింద వేసి కోటీశ్వరుని ఇంటికోడలు కావాలనుకుంటుంది. నా కొడుకు చాలా బుద్ధిమంతుడు" అని గట్టిగా సమర్థించాడు.

కాళ్లకింద నేల కదిలిపోతున్నట్లైంది కమలకు. అసహ్యం, ఉక్రోషం కలగలిసి పొంగుకొచ్చినై.

"ఇదన్యాయం." అడవి అదిరేలా అరిచింది. కాని జగ్గారావనే అడవిమృగం గుండె పిసరంతైనా చెదరలేదు.

"అయ్యా!" అంటూ అందరిముందుకొచ్చింది. "ఈ దొర నన్ను భూమి, ఆకాశం, చెట్ల సాచ్చికంగా పెండ్లిజేసుకున్నాడు. మొదట రాజు చెట్లకింద, ఆటెన్క నా గుడిసెల సంసారం జేసినం. నన్ను వాళ్లింటికి తీసుకుపోతనని వాళ్లమ్మమీద ఒట్టువెట్టుకున్నాడు. ఇప్పుడుగా చెట్లు, బూమి, ఆకాశం సాచ్చికం జెప్పుమంటే చెప్పుతాయా?" నిలదీసింది.

తండ్రీకొడుకుల వాదన వీగిపోయింది.

"జగ్గారావు దొర తప్పుజేసిండు." తేల్చిపారేశారు పెద్దలు.

"అయితే ఏం జెయ్యాల్నో మీరే చెప్పుండ్రి." అడిగాడు తండ్రి —చిటపటలాడ్తూ.

"మా కులాచారంప్రకారం కమలను మనందరి ముందు పెండ్లిజేసుకోవాలె. ఇంటికి తోలుక పోవాలె."కులపెద్ద తీర్మానం.

"లేకపోతే...!" కసిగా అన్నాడు జగ్గారావు.

"లేకపోతే చేసిన తప్పుకు అపరాధం గట్టాలె. మాకు దావతియ్యాలె."

రెండోది బాగా నచ్చింది తండ్రీ కొడుకులకి. అడిగినంత అపరాధం కులసంఘానికి, అడిగిన దానికంటే ఎక్కువడబ్బు దావతు (విందు)కు ఇచ్చేసి చేతులు దులుపుకుని వెళ్లారు.

లోకమంతా, చీకటిగా కన్పించింది కమలకు.

"ఒక ఆడదాని మానానికి ఖరీదు గడ్తరా? గీ అధికారం వీళ్లకెవలిచ్చిండ్రు?...పంచాయతీ పెద్దలమీద కాండ్రించి ఉమ్మెయ్యాలన్నంత కోపమొచ్చింది. కాని... పెద్ద మనుషులకెదురు దిరిగితే పాణాలు దీస్తరు. కడుపులున్న బిడ్డఖస్తది. ఆ పాపం నాకే తలుగుద్ది..." తనను తాను సముదాయించుకుంది.

పంచాయితీ పెద్దలు ఆ రాత్రంతా తాగి తందాన లాడిండ్రు. పందిమాంసం తినుకుంటూ పండుగ జేసుకున్నారు.

కడుపులోంచి పొంగుకొచ్చిన కల్లోల తరంగాల నదిమిపెట్టలేక గుడిసెకొచ్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

నెలలు నిండినై. నెల పొడవునాడు కొడుకు పుట్టాడు. పసికందును గుండెలకు హత్తుకుని ఓపికున్నంత వరకు ఏడ్చింది. కులపెద్ద సలహామీద కొడుక్కు విదురుడు అని పేరు బెట్టింది.

మనసు గాయం మంటల్ని కాలమే చల్లబడగొట్టింది. కొడుకు బడికెల్తూంటేతాను పనికెల్లూంది.

"అమ్మా.. మా నాన్న ఎవ్వలే?" అని విదురుడు అడిగినప్పుడు కొండమీంచి జారి బండమీద పడినట్లనిపిస్తుంది. పాపం బడిలో పిల్లలంతా వాళ్లమ్మా నాన్నలగురించి గొప్పగా చెప్పుకుంటున్నారని స్నేహితులు "మానాన్న అది తెచ్చాడు, మా నాన్న ఇది తెచ్చాడు" అని గర్వంగా చెప్పుకుంటున్నారట. "మీనాన్న ఎవరు?" అని ఎవరన్నా అడిగేసరికి ఏడుపొస్తుందట.

అడవిలో పనిజేసేప్పుడు ఆడకూలీలు మొగుళ్ల గురించి, అత్తామామలగురించి కబుర్లు చెప్పుకుంటారు, 'అంగట్లో అవ్వా ఎవనికి పుట్టినవ్ బిడ్డా?' అన్నట్టు నాకెవ్వ

లూలేరు... అనుకువే పరికి నవనాడుల్లో సప్త సముద్రాలు పొంగుతున్నై.

ఓ రోజు పట్నం నుంచి మహిళా సేవాస మితి కార్యకర్తలొచ్చి కలిశారు. కమలకు జరి గిన అన్యాయాన్ని విన్నారు. గతాన్నంతా చెప్పింది కమల. చివరికి...

"ఆడిదంటే ఆడివిల ఎండిపోయిన చెట్టైపో యింది. చెట్టుపచ్చ గున్నప్పుడు పచ్చులు వాల్తయి, జంతువులు, మనుషులు నీడల నిల్చుంటరు. ఎండిపోంగనే ఎవ్వలూ చూడరు. గుత్తేదారు వచ్చి నరికిపిస్తడు. చెట్టుబతుకు గంతే, చెట్టంత ఆడిదాని బతు కింతే." కంటతడి బెట్టింది.

సేవా సమితి కార్యదర్శి ధైర్యం జెప్పింది..."నీకు ఇప్పుడు తప్పకుండా న్యాయం జరిగి తీరుతుంది"...అని కాయి తాల మీద వేలిముద్రవెయ్యిమన్నారు. మొదట కమల అంగీకరించలేదు. కాని...తోటి ఆడకూలీలు..."కండ్లకు కావురమొచ్చి ఎవ నికో పోరన్ని కన్నది." అనే దెప్పి పొడుపు గుర్తుకొచ్చింది. ఫలానా వాడు నా మొగు డని వీళ్లందరికీ తెల్వాలె. నా కొడుక్కువాని తండ్రి గురించి తెల్వాలె..."కమ్మని ఆశకా యితాల మీద వేలిముద్రలు వేయించింది.

కోర్టు నుండి పిలుపు వచ్చింది, వెళ్లింది. జగ్గారావు గూడా వచ్చాడు. అందరి ముందు "ఈమె ఎవరో నాకు తెలియదు" అని చెప్పాడు.

అతని వకీలు "నా క్లైంటుకు సంప్రదాయ బద్ధంగా పెళ్లాడిన పెళ్లాముంది. ధర్మబద్ధ మైన పిల్లలున్నారు. ఆస్తికోసం ఈ అడవిమ నిషి అతనిమీద దావా వేసింది..."అని వాదించాడు. ఆ మాటలన్నీ కమల గుండెల్లో గుండుసూదుల్లా గుచ్చుకున్నై.

రుజువులు, సాక్ష్యాలు కావాలన్నారు. కాని తానెక్కడి నుండి తేగలదు? సమితి తరఫున ఆడవకీలు గట్టిగా వాదించింది. కేసు చాలా రోజులు నడిచింది.

ఇట్లా బతికే కంటే చావడం మేలనుకుంది. కాని, పేగుదెంచుకొని పుట్టిన పోరడు ఆశమై పోతాడని గుర్తుకొచ్చింది.

చివరికి సమితి వకీలు "కమల, జగ్గారావు, విదురుని రక్త పరీక్షలు చెయ్యాలి. జన్యుకణా లను పరీక్షించి తేల్చాలి" అని పట్టుబట్టింది. కోర్టు ఒప్పుకొంది. కేసు నడుస్తున్న కొద్దీ కమలకు లోకం పోకడ బాగా అర్థమవు తుంది.

"నిజాన్ని నిరూపించాలంటే ఇన్ని అవ స్తలా? ధర్మం గెలవారంటే గిన్ని రోజులు, గింతతిప్పలు పడాల్నా" గుడిసె గూటిలో కొలువుదీరిన అమ్మవారి నడిగింది.

నిశ్చలంగా చూస్తున్న విగ్రహం "నీమ నసు"గూడా నిశ్చలంగా ఉండాలె. నువ్వు ధైర్యంగా ఉండాలె కమలా!" చెప్పినట్టనిపిం చింది.

జన్యుకణాల పరీక్ష జరిగింది. కోర్టు తీర్పు వెలువడింది. పత్రికావిలేఖరులు, పెద్దమను షులు ఎందరెందరో విన్నారు.

"విదురుడు...కమల— జగ్గారావుల రక్తం పంచుకుపుట్టినవాడే." అని దర్మదేవత సాక్షిగా న్యాయమూర్తి ప్రకటించాడు.

కొండమీగి కోతికి కొబ్బెరిబెల్లం దొరికి నంత సంతోషమైంది కమలకు. కోర్టు వరం డాలో విదురుని నుదురు ముద్దాడి "చూడు బిడ్డా! గాయనే నీతండ్రి. నా మొగుడు." అందరిముందు జగ్గారావును చూపించింది. అనుకున్నది సాధించిన తృప్తి అంతరంగా న్నభిషేకిస్తున్నది.

"నాన్నా..!" విదురుడు జగ్గారావు ముందుకెళ్లాడు ఆశగా. ఆ బాలుని మొహం ఉదయభాస్కరునిలా వెలిగిపోతుంది. "మా బడికెప్పుడొస్తవ్ నాన్నా? నిన్ను మా దోస్తు లందరికి చూపించాలె." అన్నాడు.

వారం రోజుల క్రితమే జగ్గారావు తండ్రి మరణించాడు. ఆందోళనతో అణువణువూ



కంపించిపోతున్నాడు. ఎలా స్పందిచాలో అర్థంగాక స్థాణువైపోయాడు.

కొద్దిసేపటి తర్వాత విదురుని మోహాన్ని తేరిపారజూశాడు.

కోర్టు తీర్పు. తప్పదు. జగ్గారావు చూపులు కమల వైపు మళ్లినై. ఆనాడు ప్రాణం పోసుకున్న పసిడి బొమ్మలాగున్న కమల ఈనాడు అనుభవాలతో తలపండిన పెద్దమనిషి లాగుంది.

"రేపు మంచి రోజు." సేవాసమితి వకీ లుతో అన్నాడు జగ్గారావు. "కమలను మా ఇంటికి తీసికెల్తా." చెప్పేసి చరచరా వెళ్లిపో యాడు.

"రేపు మేంగూడా వస్తాం. రెడీగుండు కమలా!" కమ్మని సలహా ఇచ్చి మహిళా సమితి కార్యదర్శి కారులో వెళ్లిపోయింది.

★★★

అటువైపు నుండి కారు దూసుకొచ్చి కమల గుడిసె ముందాగింది. జగ్గారావు దిగి వస్తున్నాడు. ఇటువైపు నుండి జీపువచ్చి కారు ముందాగింది. మహిళా సేవా సమితి కార్యకర్తలు దిగుతున్నారు...

రాత్రి కమల బుర్రలో కలకలం రేపిన ఆలోచనలు అర్ధరాత్రి తర్వాత ఓ కొలిక్కి వచ్చినై.

గుడిసె చిన్నది. గుంపుపెద్దది. గుడిసె ముందు ఓవైపు జగ్గారావు. అతని ఇద్దరు మనుషులున్నారు. మరోవైపు సమితి కార్యక ర్తలున్నారు. కమల బయటికొచ్చింది. నిన్న టిదాకా కమలాప్తుని రశ్మిసోకి కమలని కలు వలాగున్న కమల ఇప్పుడు ఉదయకమలలా గుంది. సామి పసుపుతో సింగారించుకున్న చెంపలు, కనుబొమ్మల మధ్య ఎర్రని కుంకుమ బొట్టు, ఎర్రంచు పచ్చచీర, అదే రంగు జాకెట్టులో కళకళలాడ్తుంది. పక్కనే విదురుడు —పొద్దున అమ్మచెప్పిన మాటల్ని నెమరేసుకుంటున్నాడు.

"తయారైనారుగదా కమలా!" సేవా సమితి అధ్యక్షురాలడిగింది చిరునవ్వుతో. ఔనన్నట్టు తలూపింది. జగ్గారావు చూపులు కార్యదర్శి వైపు మళ్లినై —అర్థవంతంగా.

"రా కమలా! రాబాబూ... మనింటికె ళ్దాంరా!" కళ్లతో కారు చూపించాడు జగ్గా రావు.

"వెళ్ళు కమలా! వెళ్ళు బాబూ!" కార్య దర్శి అంది.

"అమ్మా! మీకందరికీ దండాలు." అంటూ చేతులు జోడించింది కమల. "మీరు నాకు చాలాసాయంజేసింన్రు. నా చర్మం ఒలిచిచె ప్పులు కుట్టించినా మీ రుణం తీరదు.తండ్రి ప్రేమలేని కొడుకును జూసి లోకులు జము డగాకులోలె అరిచింన్రు. నన్ను గద్దలోలె పొడుచుక తిన్నారు మాటలతోని. ఇయ్యా లటి నుండి నన్నెవ్వలూ అట్లనరు. నా కొడు కునెవ్వలూ ఎక్కరియ్యరు."

"నిజమే కమలా... నీ భర్తతో వెళ్ళి సుఖంగా ఉండు." అని కార్యదర్శి కళ్లతో జగ్గారావును చూపించింది. కమల చూసింది.

"ఈయనకు ఇంటిదగ్గర మంత్రాలతో పెండ్లిజేసుకున్న పెండ్లాముంది. పిల్లలు న్నరు. వాళ్లంతా సుఖంగున్నారు. మనదే శంల ఏ ఆడదైనా మొగడేంజేసినా ఓర్చు కుంటుంది. గాని తనకో సవతిని తెచ్చి ఇంట్ల వెడితే భరించదు. ఆమె గూడా మనసుంటి ఆడిదే. ఆమె బతుకు బండలుకావొద్దు."

"అయితే మరేమంటవు. కమలా." కార్య దర్శి కనుబొమలెగిరినై.

"ఏముందమ్మా! కష్టాలకు నేనలవాటు పడ్డ. నా కొడుకును చదివిస్తా. నా కొడుక్కు తండ్రిగా పిలిచినప్పుడు ఈయన వస్తే చాలు" గొంతు గంభీరమైంది. "రోజు మాదిరి ఇయ్యాల్లకూడా నేను పనికి పోతా. నా కొడుకు బడికి పోతడు. గందుకే తయారై నం." కొడుకు చెయ్యందుకుని గుడిసెలో కెళ్లింది.

"ఈమె భూమాత ఒడిలోకెల్తున్న సీతా మాత కాదుగదా! అనుకుంటూ అడవిలోని చెట్లు మొహాలు చూసుకుంటున్నై.